పుట్టుమచ్చ

* * *

శ్రీమతి పైడి రేణుకాదేవిగారు

పద్మిని వసారాలోకూర్చుని, లేసల్లుకుంటూంది. సీతాసుశీల పుస్తకములోచూస్తూ యేకకంఠముతో మంగళహారతి పాడుతున్నారు.

గుమ్మములో బూట్లుచప్పుడు వినిపించింది. గుఱ్ఱపు డెక్కలమాదిరి. "టక్ టక్"మని బూట్లతో శబ్దము చేస్తూ విజయకుమార్ వసారాలోంచి యింట్లోకి పోయాడు. పద్మిని లేసుసామానంత పెట్టెలోకి సర్ది లేచింది. సుశీల సీత పరికిణీలు దులుపుకుంటూ పరుగెత్తారు.

విజయకుమార్ కోటువిప్పి హేంగరుకుతగిలించి చొక్కాకుడిచేతిని పైకిలాగుతూ డబ్బాలోని సిగరెట్టును పైకితీసి వెలిగించి యీజీచైరులో కూలబడ్డాడు. పద్మిని నెమ్మదిగా కుర్చీవెనుక నిలబడింది. విజయకుమార్ మొఖములోనికి తొంగిచూసింది. నిప్పుకణాలవంటి నేత్రాలు బీభత్సంగా కనిపించాయి. విషాదచంద్రికలు చిందులుత్రొక్కుతున్న పెదవులు భయంకరంగా చూపట్టాయి. విజయకుమార్ సిగరెట్టుపొగతో మేఘాలల్లుతూ పద్మినితో అన్నాడు: "నీవల్ల నాకు ఒక ఉపకారం జరగవలసి ఉంద"ని. పద్మిని నివ్వెరపోయి "—నావల్లనా? మీకుపకారం చేసే అవకాశం నాకు లభించితే నిజముగా నేను ధన్యురా"—లంది వినయవిధేయతలు తొణుకుతూన్న కంఠంతో.

కుమార్:—(మోటుగా) నాకు యిప్పుడు కొంత ధనము కావలసిఉంది...తండ్రిగారిని...

పద్మిని:—(ఆశ్చర్యంతో) ధనం.

కుమార్:—(భయంకరముగా) అవును—ఆశ్చర్యమెందుకు ?

పద్మిని:—నేను మీకు ధనసహాయం చేయగలిగినంత...

కుమార్:—(గుడ్లు మరింతయెఱ్ఱచేసి) భర్తమీద అభిమానంగలభార్య అడిగిందే చాలని తనవద్దనున్న ఆభరణములైనను యిచ్చితీరుతుంది.

పద్మిని:—ఆభరణములా ?

కుమార్:—(రౌద్రమును రెట్టించుచు) ఆశ్చర్యముగా వ్యాఖ్యానము చేస్తున్నావే? అవును—నాకిప్పుడు ధనముకావాలి. నీవంటిమీద వస్తువులైనా తీసియిచ్చితీరాలి.

పద్మిని గొంతుకు సవరించుకొని యేమో అనబోతూండగానే కుమార్ పద్మినిచెయ్యిపట్టుకు మెడలోనున్న గొలుసును ఊడబెరక ప్రయత్నించాడు, అంతట్లోనే అన్నపూర్ణ, కుమార్ తల్లి, ఆగదిలో ప్రవేశించింది. యీదృశ్యముచూసి నివ్వెరపోయింది. కుమార్ దుష్టచర్యలకు మనస్సులో వగచింది.

కుమార్ పద్మినిని బూటుకాలితో తన్ని కోటును బుజానికితగిలించుకుని గుమ్మందిగాడు. అన్నపూర్ణ కుమార్‌ను ఆప ప్రయత్నించింది. విసరిపుచ్చి ఆమెను గెంటి మెట్లుదిగాడు.

౨

రాత్రి పదకొండు కావస్తూంది. ప్రకృతికంతా వెల్లవేసినట్లు వెన్నెలకాస్తూంది.

పద్మిని భగవద్గీత పన్రెండో అధ్యాయమువరకు చదివి పుస్తకాన్ని మడిచి బల్లమీదపెట్టి దీపంతగ్గించింది. వెన్నెల మొఖంమీద పాకుతోంది. పద్మిని చంద్రబింబమువంకచూస్తూ హృదయవేదన తలచుకుంటూంది. తన భావిజీవితమునుగూర్చి ఆలోచనా అలలే ఆహృదయసాగరంలో పరంపరలుగా పొంగిపొరలుపోతున్నవి. ఆవేదనతో అలసిపోయిన హృదయానికి కళ్లు మూతలుపడ్డాయి.

నిద్రలో...యెవరో కిటికీకి వున్న అద్దం బద్దలుకొట్టి లోన ప్రవేశిస్తూన్న సవ్వడి వినిపించింది. పద్మినికి. మెల్లగా కళ్లువిప్పింది. కిటికీలోనుంచి ఒక వ్యక్తి తనవేపుకు వస్తూఉన్నట్లు తోచింది. కళ్లు నులుపుకుంటూ దీర్ఘంగా చూచింది. విజయకుమార్. అమిత మద్యపానంవల్ల కళ్లు చింతనిప్పలుమాదిరి వెలుగును జిమ్ముతున్నయి ఆచీకటిలో పద్మిని లేచింది, నెమ్మదైన బొంగురుగొంతుకతో 'పద్మినీ'—అని పిలిచినట్లు వినిపించింది, పద్మిని ముందుకు సాగింది. తిరిగి అదేగొంతుకతో—"పద్మినీ! నాకు డబ్బు అత్యవసరము. తప్పనిసరిగా నీఆభరణ మొకటిచ్చితీరాలి—లేదా—"

పద్మిని గద్గదస్వరముతో అంది—"మీరు యిట్టి దుష్ప్రవర్తనకలవడి......" గట్టిగా గద్దించాడు—"ఛండాలీ, నాదా దుష్ప్రవర్తన నీదా! కులటవు. భర్త లేకున్ననూ సంతోషముగా కాలము వెలిబుచ్చుచున్నావు—"

తలుపువద్ద కాళ్లచప్పుడైయింది. "అదుగో—యెవరో" అంటూ కుమార్ పద్మిని మెడలోనున్న గొలుసును త్రెంచి కిటికీవైపు పోయాడు. కిటికీలోంచి క్రిందకు దూకాడు.

బైట తలుపుతెరవమని అరిచాడు కుమార్ తండ్రి హరిహరరావు. పద్మిని తలుపుతెరచింది. హరిహరరావు లోనప్రవేసించి పద్మినిని ప్రశ్నించాడు అనుమానాస్పదంగా—'మాటలు వినిపించాయి యెవరవి' అని. పద్మినికి యేమిచెప్పాలో తోచిందికాదు. గుండె పట్టినట్లయింది. యెంతప్రయత్నించినా అంటుకుపోయిన గొంతుకలోనుంచి ఒక్కక్షరంకూడ బయటకు జారిందికాదు. హరిహరరావు దీక్షగా ఆమెముఖవర్చసు తిలకించాడు. ఖంగారు భయం కనిపించాయి. ఆముఖంలో ఖంఠంలోకిచూశాడు ఆభరణాలేమీ కనిపించలేదు. మరింతఆశ్చర్యముతో గద్దించిఅడిగాడు 'నీ మెడలో గొలుసుయేది?' పద్మిని సమాధానము లేదు.

హరిహరరావు మేడపై గదిలోనికిపోయాడు. అన్నపూర్ణ లేచింది. నెమ్మదిగా సంభాషణ వినిపిస్తూంది బయటకు. పద్మిని ఆగదివద్దకుపోయి వారిసంభాషణ విన్నది. ఆసంభాషణలో — 'యెవరో......నాకు నమ్మకంలేదు...పద్మినిది యింతవరకూ నిష్కళంక ప్రవర్తనయే అని తలచితిని...' —యీవాక్యాలు పద్మినిచెవులో పడ్డాయి.

వీధితలుపు చప్పుడైంది. హరిహరరావులేచి వీధి గుమ్మమువద్దకు పోయాడు. తలుపు తెరచేఉంది. పద్మిని గదిలోకిపోయాడు. పద్మిని కనిపించలేదు. పెరట్లోచూచాడు. పద్మినిలేదు. అన్నపూర్ణ నిర్మల కూడ లేచివచ్చారు. యిల్లంతా గాలించారు. పద్మిని జాడలే కనిపించలేదు.

3

రాత్రి పండ్రెండు కావస్తూంది—

చీకటిపడ్డదిమొదలు హోరుల వర్షం ఆకాశం చిల్లులుపడ్డట్లు నిలిచి కురుస్తూంది.

విజయకుమార్ మోహిని బాబూరావు శంకరం చీట్లపేక ఆడుతున్నారు. బల్లమీద విజయకుమార్‌కు యెడమచేతిప్రక్కగా ఉంచబడిన బ్రాందీసీసా లేవనెత్తి గ్లాసులోకివంచి అందరికీ అందిస్తున్నాడు కుమార్. అందరు ఒకరితరువాత ఒకరుత్రాగుతూ కేరింతాలుకొరుతూ చీట్లపేక సాగిస్తున్నారు.

తలుపు చప్పుడయింది—మోహినిలేచి—'యెవరబ్బా యింతవర్షములో వచ్చింది' అంటూ తలుపువద్దకుపోయింది. తడచిన జీర్ణవస్త్రములతో పిచ్చివాలకములోనున్న ఒకముష్టిది మెట్లమీదనిలబడి వణుకుతూంది. మోహిని తేలిపోతూన్నకళ్లతో చూస్తూ—'యిక్కడనీకేం దొరకదుపో' అనిగద్దించి చేతితో సౌజ్ఞచేసింది. ఆస్త్రీ దీనంగా హృదయాన్ని కరిగించేకంఠంతో—'తల్లీ! నాకు నాల్గురోజులనుంచి తిండిలేదు. ఆకలిబాధనైనా జయించాను కాని యీ చలిబాధను భరించలేకున్నాను. కొంచెము యీతలుపు

మూల పండుకోనివ్వండీ తల్లీ! మీకు మహాపుణ్యముంటుంది' అంది.

లోపలనుంచి—'నీది ఆట' అని శంకరం కేక వేశాడు. మోహిని 'మీరు ముగ్గురే ఆడుకోండి' అని గట్టిగా కేక వేసింది. లోపల పక్కున నవ్వారు. గ్లాసు రాతిమీదపడి ముక్కలైనచప్పుడు వినిపించింది. మోహిని తొందరగా పరుగెత్తింది. తిరిగి అయిదు నిమిషాలలో వచ్చింది. అంతవరకూ ఆస్త్రీ వర్షంలోనే నిలబడిఉంది. మోహిని ఆస్త్రీని లోపలికి రమ్మని 'అన్నంఉంది తింటావు' అని అడిగింది. జీర్ణ కంఠంతో — 'అంతకంటేనాతల్లీ' అంది ఆస్త్రీ. మోహిని ఆస్త్రీని వసారాలోనికి తీసుకువెళ్లి విస్తరిలో అన్నంవడ్డించింది. ఆస్త్రీ అన్నంతింటూంది. మోహిని ఆస్త్రీనేపరికిస్తూ కూర్చుంది. ఆముఖంలో పోషణలేక శుష్కించి జీర్ణిస్తున్న సహజసౌందర్యాన్ని పరికించింది మోహిని.

మోహిని:—అమ్మా నీకెవరులేరూ?

ఆస్త్రీ:—(సగం మూతలుపడుతూన్న కళ్లతో) లేదుతల్లీ యీప్రపంచములో నాకు నాఅన్నవాళ్లే లేరు.

మోహిని:—అయితే అమ్మా నీకు తిండి బట్టా పెడతాం యిక్కడఉంటావు—మాయింట్లో పని చేస్తువుగాని.

ఆస్త్రీ:—(ఆశతో) అంతకంటేనా తల్లీ.

మోహిని:—అయితే యిక్కడపండుకో. తడి బట్టలు వదిలి నేను ఒకబట్టయిస్తాను కట్టుకో—అవును కాని నీపేరు?

ఆస్త్రీ:—(కొంచముసేపాగి) కనికి.

మోహిని:—కనికి? కనికీ యిదుగో యీచాప మీద పండుకో.

లోపలనుంచి చప్పట్లు వినబడ్డాయి.

౪

కనికి చావిడీఊడుస్తూంది. విజయకుమార్ చేతబెత్తం ఆడించుకుంటూ వసరాలోకి ప్రవేసించి కనికీ, 'కనికీ, మీఅమ్మగారేరీ?' అన్నాడు.

కనికి పరిహాసంగాఅంది—'అమ్మగారు అయ్యగారిదగ్గరకు వెళ్లారు' అని. కుమార్ కోపాన్ని కురిపిస్తూ 'ఎక్కడకీ' అని గద్దించాడు.

కనికి:—(మందస్మితముగా) 'డాక్టర్ అయ్యగారింటికి!

కుమార్:—కనికీ నీవు మాటల్లో పలిటీలు కొట్టిస్తావే—చాలచమత్కారంగా మాట్లాడగలవు.

కనికి సిగ్గుతో తలవంచింది.

కుమార్ టేబిలువద్దఉన్న కుర్చీలోకూర్చున్నాడు.

కనికి:—లాంతర్లుతెచ్చి తుడుస్తూంది.

కుమార్:—కనికీ! నీముఖం నాకు చాలపరిచయంగాఉంది. నిన్ను నేను యెక్కడో చూసినజ్ఞాపకం.

కనికి:—(ఖంగారుని సమర్థించుకుంటూ) నేను మిలటరీ హోటల్లో కొన్నాళ్లు అంట్లు తోమడానికి ఉన్నాను. అప్పట్లో చూసిఉంటారు.

కుమార్:—యేమొ యెక్కడచూసానో, జ్ఞాపకం మాత్రం లేదుకాని మొఖంమాత్రం చిరపరిచయంగానే ఉంది.

కనికి:—అదే అక్కడే అయిఉంటుంది.

కుమార్:—అయితే కనికి నీకసలు పెండ్లి కాలేదూ?

కనికి:—(సిగ్గుతో మొఖందాచుకుంటూ)యేమో?

కుమార్:—(ఆశ్చర్యంగా) యేమోనా? నీకు పెండ్లయిందో లేదో నీకే తెలీదూ?

కనికి:—నిజంగా తెలీదు.

కుమార్:—నీకు పెండ్లికాకపోతే నన్ను చేసుకుంటావు?

తుడుస్తూతుడుస్తూన్న లాంతర్లు వదిలేసి వంటయింట్లోకి పరుగుత్తింది కనికి.

కుమార్:—కనికీ—పరుగెడ్తే వదిలిపోతుందా? నిన్ను చూసినప్పటినుంచీ నాహృదయం నీమీదే అత్తుక్కుపోయింది.

కనికి:— (వంటయింట్లోంచి) మాయమ్మగారితో చెప్పుతా నుండండి,

కుమార్:—(పక్కుననవ్వి) మీ అమ్మగారు? కుమార్ వంటయింట్లోకిపోయి కనికి చెయ్యిపట్టుకుని తలనిమురుతూ అన్నాడు—'కనికీ నువ్వూ నేనూ కలసి యెక్కడికైనా పోదాం?'

కనికి నవ్వింది—

కుమార్:—అయితే రేపురాత్రి.

మెట్లమీద మోహనాంగి స్లిప్పర్ల చప్పుడయింది.

※

మోహనాంగిని మోసగించి మోహనాంగియింట్లో ద్రవ్యందొంగిలించి కనికినితీసుకుని విజయకుమార్ ఆవూరువచ్చి యించుమించు మూడునెలలుకావస్తుంది.

విజయకుమార్ మిక్కిలి వ్యాధిగ్రస్తుడై మంచముపట్టియున్నాడు. తానదివరకుచేసిన దుష్ప్రవర్తనా ఫలితముగా ఆరోగ్యముచెడి మిక్కిలి దీనస్థితిలో ఉండవలసివచ్చింది. కనికి అతనికి అన్నివిధాలా తోడునీడై ఉపచారంచేస్తూంది.

ఆరోజు ప్రొద్దునుంచి అదేవిధముగా నున్నది, కలవరింపులు, పిచ్చికేకలు—సంధిగుణాలు—కనికి అనేకవిధాల ఉపచారంచేసినా రోగం కుదరనందుకు విచారిస్తూ భగవంతునిమీద భారంవేసింది.

విజయకుమార్ హృదయంమీద తానదివరకుచేసిన దుష్టచర్యలు, విచిత్రజీవితం, తెరమీద సినీమాచిత్రాల మాదిరి కనిపిస్తున్నాయి. అప్పటికి అతనికి జ్ఞాననేత్రం తెరవబడింది. తన సతీమణి, పతివ్రతాశిఖామణి, పద్మిని తనకొనర్చిన మేలు, తను ఆమెకు తిరిగిఒనర్చిన ద్రోహం అప్పటికతనిహృదయం గ్రహించగలిగింది. అతనిహృదయం పశ్చాత్తాపాగ్నిలో దహించుకుపోతూంది; పద్మిని మందస్మితవదనారవిందం సుందరవిగ్రహం అతని కళ్ళకికట్టినట్లు కనిపిస్తుంది. మతిచలించిపోయింది. "పద్మినీ" అని ఒక్కనిట్టూర్పు విడిచాడు.

గ్లాసులో వైద్యుడిచ్చినమందు పోస్తున్న కనికి ముఖం యెర్రబారింది. శరీరం కంపించింది. వేగంగా పరుగెత్తుకొచ్చి కుమార్ కళ్ళలోకి చూసింది. కుమార్ కళ్లలో అశ్రుకెరటాలు పొరలిపోతూన్నాయి. ఆముఖంలో పశ్చాత్తాపము, వేదన, చింత, పొడకట్టాయి కనిక్కి.

తిరిగి కుమార్ 'పద్మినీ' అని రంకెవేసాడు. కనికి కుమార్ను గట్టిగా కౌగలించుకుంది. యెర్రబారినకళ్లు పెద్దవిచేసి కుమార్ దుష్టురాల నాహృదయలక్ష్మి పద్మినినుంచి నన్ను వేరుచేసి పాపిష్టిజీవితమునకు పురికొల్పిన నీవే యీదుష్టవృత్తికి కారకురాలివి.

కనికి కన్నీరుతుడుచుకుంటూ గద్గదస్వరంతో ముఖంమీద కొంగుకప్పుకొని అంది—'యీపాపిష్టి కనికే ఆపాడుపద్మిని.'

అప్రయత్నంగా లేచికూర్చున్నాడు కుమార్. "రత్నమెక్కడ...బొగ్గెక్కడ"

కనికి మరింతదగ్గరకుపోయి "రత్నమే బొగ్గు" అంది.

కుమార్:—"పద్మినివి నీవేఅయితే వక్షస్థలంమీది పుట్టుమచ్చ యేదే?"

కనికి బట్టతొలిగించి వక్షస్థలంమీది పుట్టుమచ్చ చూపించింది.

బోటుగాకూర్చున్న చేతులు జారిపోయి మంచంమీద కూలబడ్డాడు కుమార్.

ముద్దకడుతున్న గొంతుకతో — "పద్మినీ"— పా...పి...ని..." అంటూ కళ్లుమూసాడు కుమార్.